క్లుప్తంగా

కామాక్షితాయి సేవలో జిల్లా అదనపు జడ్జి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని జిల్లా అదనపు జడ్జి ఏవీఎస్ పవన్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అతిథులను శేషవస్త్రంతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- ఆర్వో చినఓబులేసు



చెక్‌పోస్టులో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్వో ఓబులేసు

మనుబోలు : ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన ఓబులేసు అన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఆయన ఆదివారం మనుబోలు మండలంలో పర్యటించారు. బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును పరిశీలించారు. హైవేపై వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. చెక్‌పోస్టు ఏర్పాటు చేయడంపై ఎస్సై అజయ్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిల్లులు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తరలిస్తుంటే సీజ్ చేస్తారన్నారు. ఎన్నికలయ్యే వరకూ ఫంక్షన్ హాలును అద్దెకు ఇవ్వాలంటే అనుమతి తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల సమావేశాలకు స్థానిక తహసీల్దార్ అనుమతి ఉండాలన్నారు. ఆయన వెంట డీటీ శివప్రసాద్, ఎస్సై అజయ్‌కుమార్, ఏఎస్సై ముజీర్‌బాషా, వీఆర్వో అఖిల్ ఉన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రమీలమ్మ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డులో కౌన్సిలర్ ప్రమీలమ్మ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసన్నకుమార్ రెడ్డిని, ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

తాటిపర్తిలో జిల్లాస్థాయి పండరి భజన పోటీలు



పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామం రుక్మిణిదేవి సమేత పాండురంగ స్వామి దేవస్థానం 49వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి పండరి భజన పోటీలను శనివారం రాత్రి నిర్వహించారు. ఇందులో భాగంగా కోలాటం, చెక్కభజన, పండరి భజన గురువుల ఆధ్వర్యంలో మొత్తం 15 బృందాలు పాల్గొన్నాయి. సాంప్రదాయ కళలు అంతరించిపోకుండా ప్రతి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లాస్థాయి భజన పోటీలను నిర్వహించి నగదు బహుమతులు అందజేస్తుంటారు. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పోటీలను తిలకించేందుకు విచ్చేశారు. కోలాటం విభాగంలో మొగళ్లూరుకు చెందిన భజన గురువు ఆకుల చినగంగిరెడ్డి, దగదర్తి వెంకటేశ్వర్లుదాస్ బృందం ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించాయి. పండరి భజన విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను చేజర్ల మండలం ఆదూరుపల్లికి చెందిన చీర్ల శీనయ్యదాస్ బృందం, పొదలకూరు పద్మావతినగర్‌కు చెందిన ఎం.ప్రభాకర్ బృందం, నెల్లూరుకు చెందిన కొమ్మలపూడి శ్రీను బృందం సాధించారు. చెక్కభజన విభాగంలో పడారుపల్లికి చెందిన వెంకటేశ్వర్లుదాస్ బృందం కైవశం చేసుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేతలను సన్మానించి జ్ఞాపిక, నగదు బహుమతులను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

విడవలూరు : మండల కేంద్రమైన విడవలూరులో స్థానిక తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులంతా ఈత మట్టలతో ఏసుక్రీస్తు గీతాలను ఆలపిస్తూ గ్రామంలో తిరిగారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ బి.లోకరాజు భక్తులను ఉద్దేశించి దైవసందేశం ఇచ్చారు.

సంక్షేమ సిరులు.. ప్రగతి కాంతులు

- బిట్–4 సచివాలయ పరిధిలో రూ.73.35 కోట్లతో అభివృద్ధి పనులు
- డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.18.50 కోట్ల సంక్షేమ పథకాలు
- గడపగడపకు మన ప్రభుత్వంలో సమస్యల పరిష్కారం

డీబీటీ లబ్ధిదారుల సంఖ్య
3,786 మంది

బ్యాంకులో జమైన నగదు
రూ.**12,16,03,591**

నాన్‌డీబీటీ లబ్ధిదారుల సంఖ్య
1,798 మంది

నగదు రూపంలో
రూ.**6,34,89,893**

డీబీటీ, నాన్‌డీబీటీ నగదు మొత్తం
రూ.**18,50,93,484**

పొదలకూరు : పొదలకూరు బిట్–4 సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టింది. ఇక్కడి కాలనీల్లో మట్టిరోడ్డు లేకుండా సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందడంతో పాటు, వృద్ధులకు పింఛన్లను 1వ తేదీ తెల్లవారుజామున ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నారు. జగనన్న లేఅవుట్లలో పేదలకు నివేశన స్థలాలను అందజేయడంతో పాటు, ఎన్నో ఏళ్లుగా ఉన్న విద్యుత్, భూముల సమస్యలను పరిష్కరించారు. భూమిలేని నిరుపేదలకు భూములను అందజేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో బిట్–4 సచివాలయ పరిధిలో 2019 నుంచి 2023 వరకు రూ.73.35 కోట్ల పైచిలుకు వివిధ రకాల అభివృద్ధి పనులు జరిగాయి.



పొదలకూరు బిట్–4 సచివాలయ భవనం



వీధిల్లో నిర్మించిన సైడ్‌డ్రెయిన్లు

పేదలకు అందుబాటులో సచివాలయం

అధిక సంఖ్యలో పేదలు ఉన్న లింగంపల్లి తోపు, వెంకటేశ్వరనగర్, లింగంపల్లి ఎస్సీకాలనీలకు అందుబాటులో బిట్–4 సచివాలయం, ఆర్బీకే, విలేజ్‌హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించారు. సీసీ రోడ్లు, సైడ్‌డ్రెయిన్ అంటే తెలియని ఈ ప్రాంతంలో వీధివీధిలో సీసీరోడ్లు, మురుగు కాలువలను నిర్మించడం వల్ల భారీ వర్షాలకు ఇళ్లలోకి వర్షపు నీరు చేరే బాధలు తప్పాయి. సోమశిల–పొదలకూరు మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న ఇళ్లకు పేదలు సులువుగా వెళ్లేలా రోడ్ల పునర్నిర్మాణం కూడా జరిగింది. సచివాలయ పరిధిలోని తెలుగుగంగ పునరావాస కేంద్రం వెంకటేశ్వరనగర్‌లో అంతర్గత రోడ్లతో పాటు, సీసీడ్రెయిన్లను నిర్మించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోయాయి.



సుందరంగా రూపుదిద్దుకున్న వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్

అన్ని పథకాలు అందుతున్నాయ్



మాకు సంక్షేమ పథకాలు సులువుగా అందుతున్నాయి. అందుబాటులోనే సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. మా వెంకటేశ్వరనగర్‌లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టడం వల్ల ఇబ్బందులు తొలగిపోయాయి. విద్యుత్ స్తంభాలను కూడా కొత్తగా ఏర్పాటు చేశారు. మంత్రి కాకాణి చొరవతో సమస్యలు లేకుండా పోయాయి.

– జమ్మలమూడి సరస్వతీ, వెంకటేశ్వర్, పొదలకూరు

చెంతనే సచివాలయం



మంత్రి కాకాణి ప్రతి గడపకు వెళ్లి పేదల సమస్యలను తెలుసుకోవడం వల్లే పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగింది. చిన్నపాటి సమస్యను కూడా మంత్రి నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. పేదల మధ్యనే సచివాలయం, హెల్త్ క్లినిక్ భవనాలను ఏర్పాటు చేశారు.

– వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఉప సర్పంచ్, పొదలకూరు

కాలనీల్లో సైడ్ డ్రెయిన్లు



సచివాలయ పరిధిలో ఉన్న ప్రతి కాలనీలో సీసీ సైడ్ డ్రెయిన్లను రూ.కోట్లు వెచ్చించి నిర్మించారు. ఈ డ్రెయిన్ల వల్ల కాలనీ వాసులకు ఎంతోగానో ఉపయోగం ఉంది. వర్షాకాలంలో పేదల ఇళ్లలోకి నీరు చేరకుండా డ్రెయిన్ల ద్వారా నీరు వెళ్తుంది.

– కె.కసనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పొదలకూరు

సిమెంటు రోడ్లు వేశారు



గతంలో మమ్మల్ని ఎవరూ పట్టించుకునే వారు కాదు. కాలనీలో ఇళ్లకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. మంత్రి కాకాణి పర్యటన తర్వాత రూపురేఖలు మారాయి. సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం జరిగింది. వీధివీధిలో రోడ్లు వేయడం వల్ల వర్షం కురిసినా ఇబ్బంది లేవు.

– ఇండ్ల విజయమ్మ, లింగంపల్లితోపు, పొదలకూరు

పెద్ద ఎత్తున అభివృద్ధి



మంత్రి కాకాణి ప్రోత్సాహంతోనే బిట్–4 పరిధిలో వేగవంతంగా అభివృద్ధి పనులు జరిగాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. తరువాత వాటిని పరిష్కరించారు. అందువల్లే ఇంత పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారు.

– గుంటి శ్రీనివాసులు, బిట్–4 ఎంపీటీసీ సభ్యుడు, పొదలకూరు

అడుగడుగునా ఘన స్వాగతం



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంకటాచలంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రజలు నీరాజనాలు పలికారు. వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకున్న మంత్రి కాకాణికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య ఆధ్వర్యంలో గజమాలతో సన్మానించారు. వెంకటాచలం పంచాయతీ పరిధిలోని అన్ని కాలనీలు, ఎర్రగుంట, అబ్బీసాహెబ్ కండ్రిగ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. అడుగడుగునా మహిళలు మంత్రి కాకాణికి కర్పూర హారతులతో స్వాగతం పలికారు. జై జగన్.. జై కాకాణి నినాదాలతో యువకులు హోరెత్తించారు. రాబోయే ఎన్నికల్లో తామంతా వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నకు అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంతియాజ్, తాటిపర్తి సురేష్, నరేష్‌నాయుడు, అంకులయ్య, అశోక్, చీకుర్తి నరసయ్య పాల్గొన్నారు.



గజమాలతో మంత్రి కాకాణికి సన్మానం

నేటి నుంచి ఇంటింటి ప్రచారం

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితారెడ్డి పట్టణంలో సోమవారం నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు కాకాణి రమణారెడ్డి నగర్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారన్నారు. సుమారు వారం నుంచి పది రోజుల పాటు ఆమె ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు వేయాల్సిందిగా ప్రజలను అభ్యర్థిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా సూచించారు.

వైభవంగా రథోత్సవం



లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

ఇందుకూరుపేట : మండలంలోని ఇందుకూరుపేటలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. అనంతరం గ్రామవీధుల్లో ఊరేగించారు. అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో రాత్రి పారువేట, అశ్వ వాహన ఉత్సవం జరిగింది.

గడ్డివామి దగ్ధం

- యువకుడికి గాయాలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొడవలూరు : మండల కేంద్రమైన కొడవలూరు దళితవాడలో పది ఎకరాల గడ్డివామి ఆదివారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన కాకాణి చినబాబుకు చెందిన పది ఎకరాల గడ్డివామిని తన ఇంటికి సమీపంలో వేసుకున్నారు. ఏం జరిగిందో కానీ ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో గడ్డివామి తగులబడుతూ పెద్ద ఎత్తున మంటలు ఎగిశాయి. నివాసాలకు సమీపంలో గడ్డివామి ఉండడంతో స్థానికులు ఆందోళనకు గురై అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో పాటు స్వచ్ఛందంగా మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. స్థానిక యువకులు స్వచ్ఛందంగా మంటలను అదుపు చేసే క్రమంలో గాలి సంతోష్ అనే యువకుడి చేతికి గాయమైంది. అనంతరం అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేసింది. అప్పటికే గడ్డివామి తగులబడడంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



ఇందుకూరుపేట: పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే ప్రసన్న



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే

ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేటలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వరంలో భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇందుకూరుపేటలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్న వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, ఎమ్మెల్యే ప్రసన్న చేపడుతున్న అభివృద్ధిని చూసి ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డి ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు నాయకులు తెలిపారు. కాటూరి సూరిబాబు, మునెయ్య, కిరణ్, ముంగర రమేష్, ఇరువూరు వెంకటేశ్వర్లు, కామాటి వీధికి చెందిన యువకులతో పాటు సుమారు వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లిపల్లి విజయ్‌కుమార్, జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, నిడిముసలి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు గురజాల బుజ్జిబాబు, వేళ్ల భానుచంద్రశేఖర్, అద్దంకి రాజ, జి.వాసు, చక్రి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చి పట్టణంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని ఆరో వార్డు కౌన్సిలర్ రహమత్‌బాబు ఆధ్వర్యంలో దాదాపు 50 మంది టీడీపీ కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రసన్న వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మోర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

వెంకటాచలం : రానున్న ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని, వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య తెలిపారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎవరికీ సాధ్యం కాని రీతిని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఐదేళ్లలో అభివృద్ధి చేశారన్నారు. సీసీరోడ్లు, సైడు కాలువల నిర్మాణం, తాగునీరు, సాగునీరు, నాడు–నేడు పథకం కింద పాఠశాలల అభివృద్ధి పనులను మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి చేయించారని తెలియజేశారు. ప్రజలు టీడీపీని నమ్మే ప్రసక్తే లేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో దఫా సీఎం కావడం ఖాయమని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నేత కొణిదెన విజయభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బందికి పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న ఆరోగ్య సిబ్బంది



కొడవలూరు: అవార్డు అందుకుంటున్న వైద్యాధికారి రామకృష్ణ

పొదలకూరు : ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా పొదలకూరు ఆరోగ్య ఉపకేంద్రం సహాయకురాలు ఎం.రాధాకుమారి, ఆశా కార్యకర్త జి.సీతకు పురస్కారాలు దక్కాయి. జిల్లా టీబీ, లెప్రసీ అండ్ ఎయిడ్స్ వ్యాధి నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి చేతులమీదుగా ఆదివారం ప్రశంసా పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో డీసీఎస్‌హెచ్ డాక్టర్ రమేష్‌నాథ్, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురస్కారాలు అందుకున్న రాధాకుమారి, సీతను వైద్యాధికారులు నరసింహారావు, కిరణ్‌రిషిత, కావ్యశ్రీ, స్రవంతి అభినందించారు.

- కొడవలూరు: క్షయ బాధితులను ప్రాథమిక దశలోనే గుర్తించి నివారణకు విస్తృతంగా కృషి చేసిన కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణకు అవార్డు దక్కింది. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా విశేష సేవలు అందించిన సిబ్బందికి నెల్లూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆదివారం అవార్డులు ప్రదానం చేశారు. కొడవలూరు వైద్యాధికారి ఎం.రామకృష్ణ సిబ్బందితో సమన్వయం చేసుకుని క్షయ బాధితులను గుర్తించి చికిత్స అందించడంలో కీలకపాత్ర పోషించారు. దీంతో జిల్లా కుష్టు నియంత్రణాధికారి ఖాదర్‌వలి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మనుబోలు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పొదలకూరు : ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు

మనుబోలు : ప్రతిఒక్కరూ క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజయ్య అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ నుంచి ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, గళ్లలో రక్తపు చారలు, సాయంత్రం వేళ జ్వరం, బరువు తగ్గిపోవడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిని గుర్తించి వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగిస్తే టీబీని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్న వారికి పౌష్టికాహారం నిమిత్తం ప్రభుత్వం నెలకు రూ.500 చెల్లిస్తుందని తెలిపారు. వైద్యులు మొహిసినా సుల్తానా, గేయ పూజిత, సూపర్‌వైజర్లు హైమావతి, వెంకటరమణయ్య, స్టాఫ్ నర్సులు అరుణమ్మ, సుజాతమ్మ, కవిత పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

పొదలకూరు : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో పొదలకూరు పట్టణంలో క్షయ వ్యాధి నిర్మూలన ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ క్షయవ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిందిగా సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, జలుబు తగ్గకుంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిందిగా తెలిపారు. ఈ ర్యాలీలో డాక్టర్ స్రవంతి, ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



ఆలయ యాగశాలలో జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి కాకాణి

ముత్తుకూరు : మండలంలోని తాళ్లపూడి పంచాయతీ కప్పలదొరువులో నూతనంగా నిర్మించిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. మేళతాళాలు మంగళ వాయిద్యాల మధ్య యాగశాలలో జరిగిన పూర్ణాహుతిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రతిష్టించిన నూతన విగ్రహాన్ని దర్శించి, వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. వైఎస్సార్‌సీపీతో పాటు వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు, పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.